# ప్రారంభం సరే.. కొనేదెప్పుడు ?



వెల్దుర్తి: మాసాయిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి

## సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మహేందర్ రెడ్డి

శివ్వంపేట, నవంబర్ 6 : గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించినా ఎప్పటినుంచి కొనుగోలు చేస్తారని అధికారులను సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మహేందర్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం శివ్వంపేటలో ఆయన మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికి కూడా కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించలేదని, ప్రారంభించిన చోట ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. రెండు, మూడు రోజుల్లో జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు జరగని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున్న ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

**నర్సాపూర్‌లో..**

నర్సాపూర్, నవంబర్ 6 : నర్సాపూర్ పట్టణంలోని వెల్దుర్తి మార్గంలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభమై నేటికీ పది రోజులు గడిచినా ఒక్క సంచి కూడా తూకం వేయలేదు. ఇప్పటికే ఓ సారి వర్షం కురిసి ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యాన్ని తూకం వేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ విషయంపై పీఏసీఎస్ సీఈవో వెంకటస్వామిని వివరణ కోరగా.. నర్సాపూర్‌లోనే కాకుండా ఎక్కడ కూడా కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాలేదని, నేడు ప్రారంభిస్తామని తెలిపారు. కొనుగోలుకు సంబంధించిన సామగ్రి రైస్‌మిల్‌లో ఉన్నాయని, ప్రారంభం కాగానే కేంద్రానికి తీసుకువస్తామ న్నారు. ఇప్పటి వరకు రైస్ మిల్ అలాట్‌మెంట్ జరగక ధాన్యం కొనుగోలు చేయలేదని అన్నారు.

**నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి**

వెల్దుర్తి, నవంబర్ 6 : రైతులు తేమశాతం తక్కువగా ఉన్న నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన మాసాయిపేటలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేం ద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ రైతు లు తమ ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు అమ్మి ఆర్థికంగా ఇబ్బందులకు గురికావద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని రైతులకు సూచించారు.

**కోతలు ముగుస్తున్నా..**

శివ్వంపేట, నవంబర్ 6 : శివ్వంపేట మండలంలో అతిపెద్ద గ్రామమైన దొంతి గ్రామంలో ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారని బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి, ఆత్మకమిటీ మాజీ డైరెక్టర్ బొద్దుల భిక్షపతి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోతలు ముగిసినా కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో ఆందోళన చెందుతున్నారన్నా రు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.

**తూప్రాన్‌లో..**

తూప్రాన్, నవంబర్ 6 : తూప్రాన్ మున్సిపల్, మండల పరిధిలోని ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని రావెల్లి, మండలంలోని వెంకటరత్నాపూర్, దాతర్‌పల్లి, ఇస్లాంపూర్, వెంకటాయపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. మిగిలిన గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను గురువారం నుంచి ప్రారంభమవుతాయని, రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతుధర పొందాలని తూప్రాన్ తహసీల్దార్ విజయలక్ష్మి సూచించారు.

**కొల్చారంలో..**

కొల్చారం, నవంబర్ 6 : ధాన్యం తూకం కోసం రైతులు రోజుల తరబడి పడిగాపులు కాయగా ఎట్టకేలకు తూకం ప్రారంభించారు. మండల పరిధిలోని వరిగుంతం, కొల్చారం, రంగంపేట్, సంగాయి పేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి కొల్చారం తహసీల్దార్ గఫర్ మియాతో కలిసి సందర్శించారు. ఆయన వెంట పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ ప్రణతి, గిర్దవర్ ప్రభాకర్, సొసైటీ సీఈవోలు రాములు, కృష్ణ తదితరులు ఉన్నారు.

**సమస్యల నివృత్తి కోసం కంట్రోల్ రూమ్ ప్రారంభం**

మెదక్ (నమస్తే తెలంగాణ), నవంబర్ 6 : వానాకాలం(ఖరీఫ్)2024–25 ధాన్యం కొనుగోలు,పర్యవేక్షణకు కలెక్టరేట్‌లో బుధవారం కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించామని అదనపు కలెక్టర్ నగేశ్ తెలిపారు. కంట్రోల్ రూమ్ 24 గంటలు పని చేస్తుందని సిబ్బంది విధుల్లో ఉంటారని రైతులు ఎటువంటి సమస్యలు ఉన్నా తెలుసుకోవచ్చన్నారు. సివిల్ సప్లై డీఎం హరికృష్ణ, డీసీఎస్‌వో సురేశ్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.



నర్సాపూర్ : ధాన్యాన్ని సంచుల్లో నింపి తూకానికి సిద్ధంగా ఉంచిన రైతులు

# బాలల హక్కులను కాపాడుదాం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జితేందర్

రామాయంపేట, నవంబర్ 6 : బాలల హక్కులను కాపాడడమే తమ ముందున్న లక్ష్యమని మెదక్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జితేందర్ అన్నారు. బుధవారం రామాయంపేట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో నిర్వహించి కార్యక్రమానికి హాజరైన జడ్జి బాలలను ఉద్దేశించి మాట్లాడారు. బాలలను ఎవరూ పనిలో పెట్టకోకూడదని ఒకవేల పనిలో పెట్టుకుంటే వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. అనంతరం రామాయంపేట పట్టణంలోని వివేకానంద ఆవాస విద్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేపట్టి విద్యార్థుల సంఖ్యను స్థితిగతులను ఇన్‌చార్జి శ్రీనివాస్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ శర్మ, రామాయంపేట ఎంపీడీవో షాజులుద్దీన్, లేబర్ ఆఫీసర్ రాజు, మధుకర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# అంబులెన్సులో ఈఎంటీ ఉద్యోగాలకు దరఖాస్తు

రామాయంపేట, నవంబర్ 6 : 108 అంబులెన్సులో ఈఎంటీ ఉద్యోగాలకు అర్హులైన వారు తమ దరఖాస్తులు చేసుకోవాలని సిద్దిపేట 108 అంబులెన్సు జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ జనార్ధన్, అఫ్రోజ్ బుధవారం రామాయంపేట విలేకరులతో తెలిపారు.108 అంబులెన్సులోని ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టుల నియామకానికి అర్హులైన వారు తమ దరఖాస్తులను అందజేయాలన్నారు. ఈనెల 8న అర్హులైన వారు బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ లైఫ్ సైన్సు, జీఎన్ఎం, బీఎస్సీ డీఎంఎల్టీ, బీఫార్మసీ చేసిన వారు మాత్రమే ఈ ఉద్యోగాలకు దరఖాస్తులను చేసుకోవాలన్నారు. ఈనెల 8న శుక్రవారం ఉదయం 10 గంటలకు సిద్దిపేటలోని బురుజు దగ్గర స్వచ్ఛబడిలో ఈ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారు. అర్హతగల పూర్తి బయోడేటాతో హాజరు కావాలని కోరారు.

# ప్రమాద బీమా చెక్కు అందజేత



ప్రమాద బీమా చెక్కును అందజేస్తున్న ఏపీజీవీబీ బ్యాంక్ అధికారులు

నిజాంపేట, నవంబర్ 6 : మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన బందారం నాగరాజు ఆరు నెలల కింద ఓ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకానికి అర్హుడు కావడంతో నిజాంపేట ఏపీజీవీబీ బ్యాంక్ అధికారులు బుధవారం మృతుడి భార్య మనస్వినికి రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. మాజీ సర్పంచ్ రజితాలక్ష్మణ్ గౌడ్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. బ్యాంక్ మేనేజర్ మురళీ కృష్ణ, అకౌంటెంట్ స్వాతి, క్యాషియర్ రవిమనోహర్, ఫీల్డ్ ఆఫీసర్ నిఖిల్ వెంకటేశ్, బ్యాంక్ మిత్ర రవి, నవీన్, లక్ష్మణ్ గౌడ్, కృష్ణస్వామి గౌడ్, పరుశరాములుగౌడ్ తదితరులు ఉన్నారు.

# ఉప్పలింగాపూర్‌లో దొంగల బీభత్సం

## ఎనిమిది ఇండ్లలో చోరీ

వెల్దుర్తి, నవంబర్ 6 : మండలంలోని ఉప్పలింగాపూర్‌లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసిన ఎనిమిది ఇండ్లలో చోరీలకు పాల్పడగా నాలుగు ఇండ్లలో నుంచి బంగారు, వెండి నగలతో పాటు నగదును ఎత్తుకెళ్లిన దొంగలు ఇండ్ల ముందు నిలిపిన వాహనాల్లో నుంచి పెట్రోల్‌ను దొంగిలించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని సట్టి వినోద, చాకలి వెంకటయ్య, చాకలి నర్సింహులు, సట్టి పెద్ద పోచయ్య, కుంట్ల ముత్యాలు, వంట లక్ష్మారెడ్డి, తలకొక్కుల దత్తు, తలకొక్కుల శ్రీనివాస్ ఇండ్లకు తాళాలు వేసి ఉండడంతో వరుసగా ఆ ఇండ్ల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డారు. సట్టి వినోద ఇంట్లో 35 తులాల వెండి పట్టీలు, రూ. 50 వేల నగదు, చాకలి నర్సింహులు ఇంట్లో రెండున్నర తులాల బంగారు నగలు, రూ. 1.50 లక్షల నగదు, సట్టి పెద్ద పోచ య్య ఇంట్లో రెండు తులాల బంగారు నగలు, 17 తులాల వెండి పట్టీలు, రూ. 50 వేల నగదు, కుంట్ల ముత్యాలు ఇంట్లో అర తులం బంగారు కమ్మ, ఐదు తులాల వెండి చెక్కడు గుత్తి చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. విషయాన్ని వెల్దుర్తి పోలీసులకు తెలుపడంతో ఏఎస్సై సాదత్ అలీ సిబ్బందితో వెళ్లి చోరీ జరిగిన ఇండ్లను పరిశీలించి వివరాలు సేకరించారు. మెదక్ నుంచి వచ్చిన క్లూస్‌టీం ఆధారాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పంట ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి




తాళ్లపల్లి తండాలో మాట్లాడుతున్న బాధితులు

శివ్వంపేట, నవంబర్ 6 : తాము కష్టపడి పంటలను సాగు చేసుకుంటుంటే కొందరు మాపై కక్షకట్టి కావాలనే పంటలను, డ్రిప్ పైపులను ధ్వంసం చేశారని మండలంలోని తాళ్లపల్లి తాండకు చెందిన బాధితులు గన్యానాయక్, పద్మ, శాంతి బుధవారం ఆందోళన చేపట్టారు. తాళ్లపల్లి తండాలో సర్వేనెంబర్ 316/81, 316/82లో పద్మ పేరిట ఒక ఎకరా 30 గుంటల భూమి వంశపారపర్యంగా రాగా, తాళ్లపల్లి తండాకు చెందిన కొందరు కావాలనే కక్షపూరితంగానే మాభూమిలో సాగుచేసుకున్న పంటలను ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను ధ్వంసం చేసిన కారకులపై అధికారులు చర్యలు చేపట్టి మాకుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గన్య, రాము, నగేశ్, కుమార్, పద్మ, జమున, భోజీ, గేమ్సింగ్, సత్యమ్మ, హంసమ్మ, సవణ్య, సునీ, రాణి, రవీందర్ ఉన్నారు.

# బాలల హక్కులపై అవగాహన

నిజాంపేట, నవంబర్ 6 : నిజాంపేటలోని ఉన్నత పాఠశాలలో విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి మూడు జిల్లాల నుంచి వివిధ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. బాల్య వివాహాలు, చిన్నారులపై లైంగిక దాడులు వంటి అంశాలను విద్యార్థులకు వివరిస్తూ వాటిపై వ్యాస రూప పరీక్షలను నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో ఎన్‌పీసీజీ జాతీయ సభ్యురాలు స్వర్ణలత, ఎంపీవో యాదగిరి, విజన్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సభ్యులు కైలాసం, తదితరులు ఉన్నారు.

# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నర్సాపూర్, నవంబర్6 : సిద్దిపేట జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి కబడ్డీ సబ్ జూనియర్ 14 కేటగిరిలో మెదక్ జిల్లా తరపున నర్సాపూర్ గిరిజన గురుకుల విద్యార్థి స్వీకర్ (9వ తరగతి) పాల్గొన్నారు. ఈ పోటీలో స్వీకర్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 7 నుంచి 9 వరకు యాదాద్రి జిల్లా తుర్కపల్లిలో జరిగే ఎ స్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ రవి పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రవి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకిశోర్, పీడీ లక్ష్మణ్, పీఈటీ రాజు, లింగం విద్యార్థిని అభినందించారు.

# నీట మునిగి మహిళ మృతి

పాపన్నపేట, నవంబర్ 6 : కుంటలో పడి ఓ మహిళ మృతి చెం దిన సంఘటన మండల పరిధిలోని లక్ష్మీనగర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం.. పాపన్నపేట గ్రామానికి చెందిన ఉప్పరి భవానీ లక్ష్మీనగర్‌లో కూలీ పనులు చేస్తూ, అక్కడే నివాసం ఉంటుంది. భవానీ ఇంటి నుంచి 4న గ్రామ శివారులో కొత్త కుంట వద్ద బట్టలు ఉతికేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీటి మునిగి మృతి చెం దింది. కొత్తకుంట వద్ద నీటిలో మహిళా మృతదేహం అటుగా వెళ్లిన వారికి కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతురాలి అన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

కౌడిపల్లి, నవంబర్ 6 : కౌడిపల్లి మండల పరిధిలోని ధర్మసాగర్ ప్రాథమిక పాఠశాలను బుధవారం మండల విద్యాధికారి బాలరాజు తనిఖీ చేశారు. పాఠశాలకు మిడ్ డే మీల్స్ ద్వారా అందుతున్న ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.

### పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 6 : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కుల గణన సర్వేకు ప్రాథమిక పాఠశాలలను మధ్యా హ్నం నుంచి మూసివేయడం సరికాదని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు కిరణ్ బుధవారం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సం ఖ్య తగ్గుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు 9 మంది విద్యార్థుల ఎంపిక



రగ్బీ పోటీలకు ఎంపికైన టేక్మాల్ మోడల్ స్కూల్ విద్యార్థులు

టేక్మాల్, నవంబర్ 6 : రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు టేక్మాల్ మోడల్ స్కూల్ నుంచి 9 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుంకరి సాయిలు, వ్యాయామ ఉపాధ్యాయుడు నర్సింహులు తెలిపారు. ఈ నెల 5న చేగుంటలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అండర్ 14 బాలికల విభాగంలో పవశ్రీ, బాలుర విభాగంలో నందు, అండర్ 17 బాలుర విభాగంలో భానుప్రసాద్, అండర్ 19 బాలికల విభాగంలో తనుజశ్రీ, సింధు, శ్రావ్య, అనుష, బాలుర విభాగంలో కృష్ణ, వేణుగౌడ్, హర్షవర్ధన్‌గౌడ్ ఎంపికైనట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అభినందించారు.

# మల్కాపూర్‌లో పశువైద్య శిబిరం విజయవంతం

తూప్రాన్, నవంబర్ 6 : మండలంలోని మల్కాపూర్‌లో పశువైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 60 ఆవులు, 30 గేదెలలో గర్భకోశ వ్యాధులను గుర్తించి చికిత్స అందించారు. గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేశారు. మాజీ ఉప సర్పంచ్ పంజాల ఆంజనేయులు గౌడ్, అసిస్టెంట్ వెటర్నరీ సర్జన్ లింగమూర్తి, గోపాలమిత్ర అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తూప్రాన్, నవంబర్ 6 : మార్నింగ్ వాక్‌కు వెళ్లిన వ్యక్తిని టిప్పర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్సై శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన బంగారు గల్ల దేవయ్య బుధవారం ఉదయం 5 గంటలకు స్నేహితులతో కలిసి మార్నింగ్ వాక్‌కు వెళ్లాడు. నాగులపల్లి బ్రిడ్జి వద్ద సర్వీసు రోడ్డులో వామప్ చేస్తుండగా నాగులపల్లి వైపు టిప్పర్ ఢీకొట్టగా దేవయ్య తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతిడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివానందం తెలిపారు.

# విత్తన చట్టాన్ని కేంద్రం సవరించాలి

## రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ అన్వేష్‌రెడ్డి

మెదక్,నవంబర్ 6 (నమస్తే తెలంగాణ) : కేంద్రం విత్తన చట్టంలో మార్పులు తీసుకురావాలని,ప్రైవేటు కంపెనీల ఆధిపత్యం తగ్గించడానికి దానికి అనుగుణంగా రాష్ట్రంలో విత్తన చట్టం రావాలని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేటి అన్వేశ్ రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. విస్తరణ అధికారుల తో స్థానికంగా రైతులు వ్యవసాయానికి వాడుతున్న వివిధ రకాల విత్తనాలు దిగుబడులు నష్టపోయిన రైతుల వివరాలు రానున్న కాలంలో సాగులో ఏ విత్తనాలు వినియోగించాలనేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారో తదితర అంశాలపై సమీక్షించారు. కేంద్రం రైతు కు ఉపయోగపడే చట్టం తేవాలన్నారు. సమీక్షలో జిల్లా వ్యవసాయాధికారులు మెదక్ గోవింద్, సంగారెడ్డి శివప్రసాద్, సిద్దిపేట రాధిక, డీసీవోలు కరుణ, కిరణ్‌కుమార్, నాగేశ్వర్‌రావు, డీసీసీబీ డైరెక్టర్లు హనుమంత్‌రెడ్డి, అనంతరెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ మేనేజర్లు సంధ్య, రాజు, కోటిలింగం, నాయకులు పాల్గొన్నారు.

# ఆగిఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి

శివ్వంపేట, నవంబర్ 6 : పొట్టులారీకి టీవీఎస్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శభాష్‌పల్లి శివారులో నర్సాపూర్–తూప్రాన్ ప్రధానరహదారి మలుపు వద్ద పొట్టులారీ ట్రబుల్ రావడంతో ఆగింది. బుధవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో నర్సాపూర్ పట్టణానికి చెందిన సాదుల శ్రీనివాస్ (42) తూప్రాన్ మిషన్‌భగీరథలో విధులకు వెళ్తూ వెనకాల నుంచి ఆగి ఉన్న పొట్టులారీని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన శ్రీనివాస్‌ను కుటుంబ సభ్యులు తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించి అక్కడి నుంచి మల్లారెడ్డి దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

# సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి

## కలెక్టర్ రాహుల్ రాజ్



టెక్మాల్ : కోరంపల్లిలో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

టెక్మాల్, నవంబర్ 6 : సమగ్ర కుటుంబ సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు అందుబాటులో ఉండి, వారు అడిగే వివరాలను అందించి సహకరించాలని, సేకరించిన వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైన నేపథ్యంలో మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని కోరంపల్లి గ్రామంలో బుధవారం ఆయన పర్యటించి క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వే తీరును పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ తులసీరాం, ఎంపీడీవో విఠల్, తదితరులు ఉన్నారు.

**క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే చేపట్టాలి**

రామాయంపేట, నవంబర్ 6 : సర్వేను క్షేత్ర స్థాయిలో సిబ్బంది చేపట్టాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. రామాయంపేట పురపాలికలోని 2వ వార్డు కోమటిపల్లిలో జరుగుతున్న సర్వేలో పాల్గొని సిబ్బందికి సూచనలు చేశారు. రామాయంపేట తహసీల్దార్ రజినీ కుమారి, శ్రీధర్‌రెడ్డి, ఆర్ఐ.రాజు, టీచర్లు శ్రీనివాస్, నవాత్ ప్రమోద్, ఆకుల రాజు, శంకర్ ఉన్నారు.

**నిజాంపేటలో..**

నిజాంపేట, నవంబర్ 6 : మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఎన్యూమరేటర్లు సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను ప్రారంభించారు. ఈ మేరకు చల్మెడలో జరుగుతున్న ఇంటింటి సర్వే సరళిని ఎంపీడీవో రాజిరెడ్డి, ఎంపీవో ప్రవీణ్ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి నర్సింహారెడ్డి, ఉపాధ్యాయుడు రామ్మోహన్ శర్మ ఉన్నారు.

**కులగణన పరిశీలన**

రేగోడ్, నవంబర్ 6 : రేగోడ్‌లో కులగణన ఇంటింటా సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్స్ పనితీరును తహసీల్దార్ నరేశ్ పరిశీలించారు. రేగోడ్, కొత్వాల్‌పల్లి గ్రామాల్లో సమగ్ర ఇంటింటా సర్వేలో భాగంగా సర్వేలో పాల్గొని ఎన్యూమరేటర్స్ పనితీరును తహసీల్దార్ పరిశీలించారు. వెంట ఆర్ఐ ఫిరోజ్ ఉన్నారు.

**పకడ్బందీగా సర్వే నిర్వహించాలి**

మెదక్‌రూరల్, నవంబర్ 6 : సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య అన్నారు. మెదక్ మండల పరిధిలోని మంబోజిపల్లిలో సర్వేను మెదక్ డీపీవో యాదయ్య పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంపీడీవో రఘు, పంచాయతీ కార్యదర్శి నగేశ్, తదితరులు ఉన్నారు.

**సర్వే సిబ్బందికి సహకరించాలి**

నర్సాపూర్, నవంబర్ 6 : సమగ్ర కుటుంబ సర్వే నిమిత్తం వివరాల సేకరణకు వస్తున్న సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఆర్డీవో మహిపాల్ అన్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీలో నిర్వహించినసర్వేలో ఆర్డీవో పాల్గొన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, ఆర్ఐ ఫైజల్ పాల్గొన్నారు.

**జిల్లా కేంద్రంలో సర్వే ప్రారంభం**


మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 6 : జిల్లా కేంద్రం మెదక్‌లో సర్వే ప్రారంభమైంది. సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటిస్తున్నారు. సర్వే కారణంగా ప్రాథమిక పాఠశాలలు బుధవారం మధ్యాహ్నం నుంచి మూతబడ్డాయి. ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహించే ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయుల సేవలను సర్వేకు ప్రభుత్వ వినియోగించుకోవడంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే పాఠశాలలు నడిచాయి.

**చిలిపిచెడ్‌లో..**

చిలిపిచెడ్, నవంబర్ 6 : గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని జిల్లా జడ్పీ సీఈవో ఎలయ్య తెలిపారు. సర్వే సందర్భంగా చిలిపిచెడ్ మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పరిశీలించారు. ఎంపీడీవో ఆనంద్, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

**క్షేతస్థాయిలో గృహాల గుర్తింపు**

చిలిపిచెడ్, నవంబర్ 6 : జిల్లాలో సమర్థవంతంగా సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వే కొనసాగుతుందని అదనపు కలెక్టర్ నగేశ్ తెలిపారు. జిల్లా సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వేలో భాగంగా మండల కేంద్రమైన చిలిపిచెడ్‌లో క్షేతస్థాయిలో గృహాల గుర్తింపు, స్టీక్కరింగ్ ప్రక్రియను పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించుటకు గణకులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ ముసాద్దిక్, డీఎల్‌పీవో సాయిబాబా, ఎంపీడీవో ఆనంద్ ఉన్నారు.



చిలిపిచెడ్‌లో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్

**వెల్దుర్తిలో..**

వెల్దుర్తి, నవంబర్ 6 : వెల్దుర్తి, మాసాయిపేట మండలాల వ్యాప్తంగా సమగ్ర కుటుంబ ఇంటింటా సర్వేను ప్రారంభించారు. మధ్యాహ్నం వరకు పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు మధ్యాహ్నం నుంచి గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ కుటుంబ యజమాల పేర్లు నమోదు చేస్తూ స్టిక్కర్‌లను అతికించారు. మాసాయిపేట తహసీల్దార్ జ్ఞానజ్యోతి హకీంపేట, ఎంపీవో విఘ్నేశ్వర్ నెల్లూర్, హస్తాల్‌పూర్ గ్రామాల్లో పరిశీలించారు.

**సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి**

అల్లాదుర్గం, నవంబర్ 6 : సమగ్ర కుటుంబ సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలందరూ సహకరించాలని ఎన్యూమరేటర్ రాంజానాయక్ అన్నారు. మొదటి రోజు ఎన్యూమరేటర్లు, సిబ్బంది డోర్లకు స్టికర్లు వేశారు. పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, నాగమణిఉన్నారు.

**'సమగ్ర సర్వే' తీరును పరిశీలించిన ఆర్డీవో**

తూప్రాన్, నవంబర్ 6 : తూప్రాన్ పట్టణంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తీరును తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి పరిశీలించారు. తహసీల్దార్ విజయలక్ష్మి, కమిషనర్ గణేశ్‌రెడ్డి ఉన్నారు.

**చిన్నశంకరంపేటలో..**

చిన్నశంకరంపేట, నవంబర్ 6 : చిన్నశంకరంపేటలో సర్వేను మెదక్ ఆర్డీవో రమాదేవి పరిశీలించారు. చందంపేటలో డీఎల్పీవో సురేశ్‌బాబు సర్వేను పరిశీలించారు.

**శివ్వంపేటలో..**

శివ్వంపేట, నవంబర్ 6 : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను శివ్వంపేట మండలంలోని 37 గ్రామ పంచాయతీలో ఎంపీడీవో నగేశ్వర్‌గుప్తా, తహసీల్దార్ కమలాద్రి ప్రారంభించారు.

# ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రామాయంపేట, నవంబర్ 6 : దవాఖానలో చికిత్స పొందుతూ విషమించి మృతి చెందిన యువకుడి కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామానికి చెందిన బండమీది వంశీ (30) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ విషమించి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి రూ.5 వేలు, నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి రూ.5 వేలు మొత్తం పదివేలను పంపించగా, బీఆర్ఎస్ నాయకులు కుటుంబ సభ్యులకు అందజేశారు. బీఆర్ఎస్ గ్రామ నాయకులు చిట్టిమల్లి నరేందర్‌రెడ్డి, వగ్గు శ్రీకాంత్ సాగర్, నర్సింహులు, తాటిపల్లి రాంకి, శ్రావణ్‌గౌడ్, నిఖిల్, కుమ్మరి శామయ్య తదితరులు ఉన్నారు.

# నర్సింగ్ హోం, క్లినిక్‌ల తనిఖీ

వెల్దుర్తి, నవంబర్ 6 : మండల కేంద్రమైన వెల్దుర్తితో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రైవేటు నర్సింగ్‌హోం, ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లను బుధవారం జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్ రమా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా గ్రామాలకు వచ్చిన అధికారులు గ్రామాల్లో ఉన్న నర్సింగ్‌హోం, క్లినిక్‌లు నిబంధనల ప్రకారం ఉన్నాయా, అర్హత లేకున్నా చేస్తున్న చికిత్సలు చేస్తున్నారా, ఏఏ చికిత్సలు అందిస్తున్నారని వివరాలను సేకరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కేవలం ప్రథమ చికిత్సలను మాత్రమే అందించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పరామర్శ



దుండిగల్‌లో రాములను పరామర్శిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

చేగుంట, నవంబర్ 6 : అమీన్‌పూర్ జర్నలిస్టు చేగుంట మండలం కర్నాల్‌పల్లికి చెందిన జనగామ రాములు గౌడ్ అత్తమ్మ దుండిగల్‌లో మృతి చెందింది. బుధవారం బాధిత కుటుంబాన్ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించారు. వారి వెంట దుబ్బాక నియోజక వర్గ బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కర్త రణం శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తూప్రాన్, నవంబర్ 6: తూప్రాన్ మండలంలోని ఇస్లాంపూర్, మల్కాపూర్ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. మాసాయిపేట ఫీడర్ పరిధిలో ట్రీ కటింగ్ చేపట్టనుండటంతో గురువారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

### విద్యార్థులు సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

చిన్నశంకరంపేట, నవంబర్ 6 : ప్రతి విద్యార్థి సేవాగుణాన్ని అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీధర్ సూచించారు. బుధవారం చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు స్వచ్ఛతనం, పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలిగించారు.

### పోషకాహారాన్ని తీసుకోవాలి

చిన్నశంకరంపేట, నవంబర్ 6 : గర్భిణులు, బాలింతలు పోషక విలువల గల ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని చందంపేటలో ఆరోగ్య పోషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED HELPERS
★ హైదరాబాద్ నందు 5 స్టార్ హోటల్‌లో పని చేయుటకు ''హెల్పర్లు'' కావలెను. 12 గంటల డ్యూటీ, 18,000/- జీతం, రూమ్+ఫుడ్ ఫ్రీ. వయస్సు: 18-30 సం||లు. No Consultency, Direct Job. Contact: 9885283513.
NT-335863_All

CHANGE OF NAME
★ I, AFREEN KHANAM (Old Name), W/o. Abdul Hameed Khan, R/o. H.No. 2-1-260, Street: Dubba Wada, Mandal: Metpally-505 325, District: Jagtial, Telangana, have Changed My Name as AFREEN NAAZ.
NTK-325733_All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.